వేంకటేశ్వరస్వామి, వినాయక ఆలయాల హుండీ లెక్కింపు

అమీర్‌పేట: ఎస్‌ఆర్‌నగర్ శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి, వినాయక ఆలయాల్లోని హుండీలను సోమవారం లెక్కించారు. వేంకటేశ్వరస్వామి ఆలయంలోని 200 రోజుల హుండీ ఆదాయం రూ.3,81,315లు వచ్చిందని అధికారులు తెలిపారు. గురుమూర్తినగర్‌లోని వినాయక ఆలయంలో 211 రోజుల హుండీల ద్వారా రూ.1,47,305లు వచ్చిందని చెప్పారు. ఆలయ చైర్మన్, దేవాదాయశాఖ అధికారులు, ధర్మకర్తలు, భక్తుల సమక్షంలో లెక్కింపు జరిగిందని ఆలయ కార్య నిర్వాహణ అధికారి నరేందర్‌రెడ్డి తెలిపారు.

రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీల్లో సాయిప్రణవ్‌కు సిల్వర్ మెడల్



అడ్డగుట్ట: తెలంగాణ రాష్ట్ర 12వ ఇంటర్ డిస్ట్రిక్ట్ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో శాంతినగర్‌కు చెందిన దర్శనం సాయిప్రణవ్ రెండో స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించాడు. 15 నుంచి 18 ఏళ్ల వయస్సు మధ్య వారికి సరూర్‌నగర్ స్టేడియంలో పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో సాయిప్రణవ్ వెండి పతకం సాధించారు. గతంలో జాతీయ స్థాయి పోటీల్లోనూ పాల్గొన్నాడు. ఈ మేరకు అతడి కోచ్ స్టాన్లీ, కుటుంబ సభ్యులు, తోటి విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని వినతి



డీసీ ఆంజనేయులుకు వినతిపత్రం అందజేస్తున్న శాస్త్రినగర్ మహిళలు

అడ్డగుట్ట: అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసే విధంగా అధికారులు ప్రయత్నించాలని రుద్రవీణ మహిళా అసోసియేషన్ అధ్యక్షురాలు ఎస్.శోభారాణి కోరారు. ఈ మేరకు సోమవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్‌తో పాటు సికింద్రాబాద్ సర్కిల్ డీసీ ఆంజనేయులును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అడ్డగుట్ట డివిజన్‌లోని శాస్త్రినగర్‌లో ఇళ్లు లేని 200 మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. అర్హులను త్వరగా గుర్తించి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు.

ఐఐసిటీ స్టాఫ్ క్లబ్‌లో కళా సిల్క్ వస్త్ర ప్రదర్శన



చేనేత వస్త్ర ప్రదర్శనలో వినియోగదారులు

లాలాపేట: తార్నాకలోని ఐఐసిటీ స్టాఫ్ క్లబ్‌లో కళా సిల్క్ ఆధ్వర్యంలో చేనేత వస్త్ర ప్రదర్శన ఏర్పాటు చేశారు. చీరలు, చేనేత వస్త్రాలు, మహిళలు, పురుషులకు డ్రెస్ మెటీరియల్స్, రెడిమేడ్ దుస్తులు, దీపావళి వేడుకకు కావాల్సిన కళాఖండాలు అందుబాటులో ఉన్నాయి. ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ వస్త్ర ప్రదర్శన అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు వికాస్ జైన్ తెలిపారు. దీపావళి పండగను పురస్కరించుకొని అన్ని వస్త్రాలపై 65 శాతం వరకు డిస్కౌంట్ సేల్స్ కొనసాగుతుందన్నారు. ప్రదర్శన వచ్చే నెల 3వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు.

చెత్తకు నిప్పంటుకొని చెలరేగిన మంటలు

రాంగోపాల్‌పేట్: మినిస్టర్ రోడ్‌లోని కిమ్స్ ఆస్పత్రి వద్ద చెత్త అంటుకుని మంటలు ఎగిసిపడ్డాయి. పెద్ద ఎత్తున మంటలు రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తేవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. మినిస్టర్ రోడ్‌లోని కిమ్స్ ఆస్పత్రి ఎదురుగా ఖాళీ స్థలంలో చుట్టుపక్కల ఉండే కార్ డెకోర్ షాపుల యజమానులు చెత్తను ఇక్కడ పడేస్తుంటారు. సోమవారం రాత్రి పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. స్థానికులు అగ్ని మాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో మంటలను అదుపులోకి తెచ్చారు. ఇక్కడి యజమానులు చెత్తను వేస్తుండటంతో అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయని, చెత్త వేసే వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



వన్నె తగ్గని 'సంత'కం

ఎర్రగడ్డ సంతకు తగ్గని ఆదరణ

- గుండు సూది మొదలుకొని ఎన్నెన్నో వస్తువులు
- ఆదివారం సందడే సందడి



ఎర్రగడ్డ-సనత్‌నగర్ మార్గంలోని ఆదివారం అంగడిలో కొనుగోలు, అమ్మకందారుల సందడి దృశ్యాలు

సనత్‌నగర్: స్క్రూడ్రైవర్ నుంచి షూష్ వరకు.. రెడీమేడ్ దుస్తుల నుంచి రేబాన్ గ్లాసెస్ వరకు.. వంటింటి పాత్రల నుంచి వయ్యారాలు ఒలకబోసే అందమైన ఆటబొమ్మల వరకు.. ఆనాటి గ్రామఫోన్‌ల నుంచి నేటి స్మార్ట్‌ఫోన్ల వరకు.. పెంపుడు పిల్లుల నుంచి మేకలు, గొర్రెల వరకు.. ఒక్క మాటలో చెప్పాలంటే అక్కడ దొరకని వస్తువంటూ ఉండదు. ఇంట్లో ఏదైనా పరికరానికి సంబంధించి స్పేర్‌పార్ట్ కోసం వెతికినా దొరక్కపోవడంతో పక్కన పడేశారా..? అలాంటి స్పేర్‌పార్ట్ ఇక్కడ బేషుగ్గా దొరుకుతుంది. ఆదివారం వచ్చిందంటే ఇటు విక్రయదారులు.. అటు కొనుగోలుదారులతో ఈ మార్కెట్ కిటకిటలాడుతోంది. శతాబ్దానికి పైగా చరిత్ర కలిగిన సంత అంతకంతకూ విస్తరించుకుంటూ పోతోంది. ఎర్రగడ్డ చౌరస్తాకు నలువైపులా ఈ మార్కెట్ అమ్మకాలు, కొనుగోళ్లు విస్తరించాయి. ఇక సనత్‌నగర్ పారిశ్రామిక వాడ అన్ని రహదారులతో పాటు సనత్‌నగర్ ప్రధాన రహదారి పొడవునా ఫతేనగర్ ఫ్లైఓవర్ వరకు ఈ మార్కెట్ కొనసాగుతోంది. అటు వేల మంది చిరు వ్యాపారులు ఈ మార్కెట్‌ను అడ్డాగా చేసుకుని బతుకును కొనసాగిస్తుండగా ఇంకోవైపు తక్కువ ధరకే తమకు కావాల్సిన వస్తువులను పొంది అటు కొనుగోలుదారులు సైతం తమ అవసరాలను తీర్చుకుంటూ వస్తున్నారు.

వందేళ్ల చరిత్రకు సాక్ష్యంగా..

వందేళ్ల చరిత్రకు ఇక్కడ మార్కెట్ సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. రెండు దశాబ్దాల క్రితం వరకు పశువుల సంత కూడా ఇక్కడే జరిగేది. వివిధ జిల్లాల నుంచి విభిన్న జాతుల ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలను రైతులు తీసుకు వచ్చి క్రయవిక్రయాలను జరుపుతుండేవారు. అయితే పెరిగిన ట్రాఫిక్ దృష్ట్యా ఇక్కడి పశువుల సంతను మోతీనగర్ సమీపంలోని బబ్బుగూడకు తరలించారు. సాధారణ మార్కెట్ మాత్రం ఇక్కడే కొనసాగుతోంది.

'సెకండ్స్'కు పెట్టింది పేరు..

ఎర్రగడ్డ సంత అంటే వస్తువులు 'సెకండ్స్'లో అమ్ముడుపోతాయన్నది వ్యాపార వర్గాలతో పాటు వినియోగదారుల మాట. షర్టులు, ప్యాంట్లు, గొడుగులు, సీడీలు, ఎలక్ట్రికల్, ఐరన్ వస్తువులు.. ఇలా ఎన్నో రకాల వస్తువులు సెకండ్ హ్యాండ్స్‌లో లభిస్తున్నాయి. ఎలాంటి యంత్రాలు, వస్తువులకు కావాల్సిన విడి భాగాలు(స్పేర్‌పార్ట్స్)కు ఈ సంతే చిరునామా. అందుకే ఎర్రగడ్డ సంతకు అంత క్రేజ్. తక్కువ ధరకే తమకు కావాల్సిన వస్తువు దొరుకుతుండటంతో వినియోగదారులు ఈ సంతబాట పడుతుంటారు. కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, మియాపూర్, అమీర్‌పేటల నుంచే కాకుండా నగరం నలుమూలల నుంచి ఈ మార్కెట్‌ను సందర్శించి తమకు కావాల్సిన వస్తువులను కొనుగోలు చేసుకుని మరీ వెళ్తుంటారు. ప్రతివారం 30–40 వేల మంది వినియోగదారులు ఈ మార్కెట్‌ను సందర్శిస్తుంటారని అంచనా.

సీజనల్ వ్యాపారాలకు ఊపు

చలికాలం మొదలైతే ఇక్కడ స్వెట్టర్ల అమ్మకాలు భారీగా సాగుతుంటాయి. కల్లంలో ధాన్యపు రాశులు పోసినట్లుగా రోడ్డుపై స్వెట్టర్లతో పాటు విభిన్న రకాల మంకీ క్యాప్‌లు, చలికి చెక్‌పెట్టే ఉన్ని దుస్తుల విక్రయాలు కొనసాగిస్తుంటారు. ఇక వర్షాకాలం వచ్చిందంటే రెయిన్‌కోట్లు, కళ్లు జిగేల్‌మని పించే కలర్స్‌లో గొడుగులు ఈ మార్కెట్‌ను ముంచెత్తుతాయి. ఇక ఎండాకాలం వచ్చిందంటే కాటన్ దుస్తులు ఎక్కువగా దిగుమతి చేసుకుని అమ్మకాలు సాగిస్తారు.







మానవహక్కుల పరిరక్షణే ధ్యేయం



నూతన సభ్యులకు నియామక పత్రాలు అందజేస్తున్న ఎస్‌జేఎఫ్‌ఐసీఆర్‌సీ చైర్మన్ రమేశ్

కంటోన్మెంట్: సామాజిక న్యాయం, మానవ హక్కుల పరిరక్షణే తమ సంస్థల లక్ష్యమని సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషనల్ సివిల్ రైట్స్ కౌన్సిల్(ఎస్‌జేఎఫ్ఐసీఆర్‌సీ), నేషనల్ యాంటీ క్రైమ్ అండ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రాష్ట్ర చైర్మన్ చెరుకు రమేశ్ అన్నారు. ఎస్‌జేఎఫ్ఐసీఆర్‌సీ కంటోన్మెంట్ ఇన్‌చార్జి ఏఈ విజయ్ కుమార్ నేతృత్వంలో ఏవీ నాగేశ్, ఎం.శోభారాణి, ఏ.శివకామిని, సయ్యద్ అబ్బాస్ సంస్థలో చేరారు. ఈ సందర్భంగా చెరుకు రమేశ్ మాట్లాడుతూ ఎస్‌జేఎఫ్ఐసీఆర్‌సీ తరఫున ఏఈ విజయ్ కుమార్ నేతృత్వంలో కంటోన్మెంట్‌లో పలు కీలక విజయాలు సాధించామన్నారు. ఇదే స్ఫూర్తితో కంటోన్మెంట్ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వారికి సామాజిక న్యాయం, మానవ హక్కుల పరిరక్షణకు పాటుపడాలన్నారు. ముఖ్యంగా కంటోన్మెంట్ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించి, సేవలు సక్రమంగా అందేలా చూడాలన్నారు.

బాల్యం నుంచే నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలి



శిక్షణ ముగింపు కార్యక్రమంలో అతిథులు, బాలలు

పిల్లల్లో నాయకత్వ లక్షణాల పెంపుపై శిక్షణ

లాలాపేట: పిల్లల్లో నాయకత్వ లక్షణాలు పెంచే శిక్షణ కార్యక్రమాన్ని తార్నాకలోని మర్రి కృష్ణ హాల్‌లో మూడు రోజులుగా అప్సా, ఇంద్రధనస్సు బాలల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. సోమవారం ముగింపు సందర్భంగా పలువురు బాలలు బస్తీల్లో ఎదుర్కొంటున్న సమస్యలను పోస్టర్ ద్వారా ప్రదర్శించారు. బాల్యం నుంచే నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలని పలువురు వక్తలు అన్నారు. కార్యక్రమానికి లాలాగూడ ఎస్సై రామేశ్వర్‌రెడ్డి, యూనిసెఫ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ మేనేజర్ డేవిడ్‌రాజ్, ఆర్‌డబ్ల్యూఏ సభ్యుడు ఖైదిల్, పీస్ కమిటీ సభ్యురాలు శ్రీలత, కృష్ణారెడ్డి, శ్రీనివాస్ సురేష్, అప్సా ప్రోగ్రాం మేనేజర్ బస్వరాజ్, కో ఆర్డినేటర్లు మంజుల, రమేష్ తదితరులు హాజరయ్యారు.

సందడిగా గాంధీ మెడికల్ కాలేజీ ఫెస్ట్



క్రికెట్ పోటీలో ఫ్యాకల్టీ టీం సభ్యులు

గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీ ఫెస్ట్ సోమవారం సందడిగా ప్రారంభమైంది. వైద్యసేవలతో బిజీగా ఉండే వైద్యవిద్యార్థులు, అధ్యాపకులకు ఆటవిడుపు దొరకడంతో కళాశాల ప్రాంగణంలో పండగ వాతావరణం నెలకొంది. ఫెస్ట్‌లో భాగంగా ఫ్యాకల్టీ, పీజీల జట్ల మధ్య టీ20 క్రికెట్ మ్యాచ్ హోరాహోరీగా సాగింది. డాక్టర్ రాంబాబు కెప్టెన్సీలో ముందుగా బ్యాటింగ్ చేసిన ఫ్యాకల్టీ జట్టు 8 వికెట్లకు 151 పరుగులు చేసింది. మురళీకృష్ణ, సందీప్‌రాజ్, కిరణ్, వంశీకృష్ణ బ్యాటింగ్‌లో అద్భుత ప్రతిభ కనబర్చారు. అనంతరం పీజీల జట్టు 18 ఓవర్లలోనే టార్గెట్‌ను ఛేదించి విజయ పతాకం ఎగురవేశారు. ఇటువంటి పోటీలు వైద్యులు, వైద్యవిద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి, ఉత్సాహాన్ని నింపుతాయని గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇందిర, సూపరింటెండెంట్ ప్రొఫెసర్ వాణి అన్నారు. 2కే21 బ్యాచ్ ఆధ్వర్యంలో కాలేజీ ఫెస్ట్ 18వ తేదీ వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

బీసీల ఐక్య కార్యాచరణ సమావేశం రేపు



లాలాపేట: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ సాధించేందుకు మరో సామాజిక ఉద్యమానికి ఉస్మానియా యూనివర్సిటీ మరోసారి వేదిక కావాల్సిన అవసరం ఉందని బీసీ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్మనబోయిన సైదులు యాదవ్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట బీసీ విద్యార్థి జేఏసీ ఏర్పాటుకు కార్యాచరణ సమావేశం నిర్వహించారు. పలు బీసీ విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ నెల 15న ఆర్ట్స్ కళాశాల న్యూ సెమినార్ హాల్‌లో నిర్వహించతలపెట్టిన ఐక్య కార్యాచరణ సమావేశంలో అన్ని విద్యార్థి సంఘాలు, ప్రొఫెసర్లు, మేధావులు, కళాకారులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ నాయకులు శంకర్, నామ సైదులు, వలిగొండ నరసింహ, రవి, శ్రీకాంత్, మంద రాజు, మధు, గణేష్, అశ్విన్, భాస్కర్ తదితరులున్నారు.

సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉంటా

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్



ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న ముంపు బాధిత ప్రాంత నివాసితులు

సనత్‌నగర్: ప్రజల సమస్యల పరిష్కారంలో తాను ఎల్లప్పుడూ ముందుంటానని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. రాంగోపాల్‌పేట డివిజన్‌లోని కాచిబౌలి, నల్లగుట్ట, చుట్టాల బస్తీ ప్రాంతాలు ముంపునకు గురికాగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆయా ప్రాంతాల్లో అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు కాచిబౌలి నాలాలో పూడిక తొలగించకపోవడంతోనే ముంపు సమస్య ఏర్పడిందని ఎమ్మెల్యేకు విన్నవించారు. నాలాను పరిశీలించిన ఎమ్మెల్యే నాలాలో పూర్తిస్థాయిలో పూడిక తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆదేశాల మేరకు కొద్దిరోజులుగా కాచిబౌలి నాలాలో పూడిక తొలగించారు. ఎన్నో రోజుల తమ సమస్య పరిష్కారం కావడంతో సోమవారం బస్తీవాసులు వెస్ట్‌మారేడ్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నర్సింగ్‌రావు, జగ్గు, ప్రశాంత్‌సింగ్, సత్యనారాయణ, రమేష్, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా 21, నల్లవంకాయ 35, పొడుగు వంకాయ 45, బెండకాయ 35, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 60, పచ్చకాకర 32, పందిరి బీర 38, క్యాబేజీ 23, క్యారెట్ 55, దొండ 28, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 75, గోకరకాయ 50, కీర 23, దోసకాయ 18, బీట్‌రూట్ 45, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 23, చామగడ్డ 21, మొరంగడ్డ 35, కందగడ్డ 45, సొరకాయ 15, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 6–7, ముల్లంగి 5–6. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

స్కూల్ బ్యాగుల పంపిణీ

అడ్డగుట్ట: పేద మధ్య తరగతి విద్యార్థులకు సాయం చేసేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు లింగాని శ్రీనివాస్ అన్నారు. బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో వరల్డ్ విజన్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో 200 మంది పిల్లలకు సోమవారం స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లింగాని శ్రీనివాస్ మాట్లాడుతూ పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు సహకారం అందిస్తున్న వరల్డ్ విజన్ సంస్థను అభినందించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, నక్క మధు, పెండెం మనోహర్, సత్తయ్యగౌడ్, శంకర్, బుద్ధ భాగ్య, రమాదేవి, దేవయ్య, సంస్థ మేనేజర్ స్వామి, కో ఆర్డినేటర్ అరుణ జ్యోతి, వలంటీర్ బాలమణి తదితరులు పాల్గొన్నారు.

ప్రమోషన్లు దక్కని అధ్యాపకుల నిరసన



లాలాపేట: ఇటీవల ఓయూలో నిర్వహించిన కేరియర్ అడ్వాన్స్‌మెంట్ స్కీం ఇంటర్వ్యూలలో ప్రమోషన్స్ లభించని పలువురు అధ్యాపకులు సోమవారం ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ యూజీసీ నిబంధనలు పాటించకుండా ఏకపక్షంగా సీఏఎస్ ఇంటర్వ్యూలు నిర్వహించి 48 మంది అధ్యాపకులకు ప్రమోషన్స్ ఇవ్వకుండా రిజెక్టు చేశారని అన్నారు. దీనిపై యూనివర్సిటీ అధికారులు స్పందించి తమకు ప్రమోషన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిరసనలో ఔటా అధ్యక్షులు ప్రొ.మనోహర్, సురేందర్‌రెడ్డి, వెంకటదాస్, నతానియేలు, రోజారాణి, అపర్ణ, రేగ రాజేంద్ర, సుమన్, మాధురి, సునీల్ కుమార్, సుజాత తదితరులున్నారు.



ప్రభుత్వ స్కూల్‌కు శాశ్వత భవనం నిర్మించాలి



డిప్యూటీ మేయర్‌కు వినతి పత్రం అందజేస్తూ..

లాలాపేట: లాలాపేట విజయ డెయిరీ క్వార్టర్స్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు శాశ్వత భవనాన్ని నిర్మించాలని కోరుతూ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డిని బాలల హక్కుల పరిరక్షణ వేదిక, తల్లుల సంఘం, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యుల బృందం సోమవారం కోరారు. ఈ సందర్భంగా వినతి పత్రం అందజేశారు. అప్పటి వరకు పాఠశాల నిర్వాహణకు సమీపంలోని హనుమాన్ ఆలయంలో తాత్కాలిక ఆవాసం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. 50 ఏళ్లుగా డెయిరీ క్వార్టర్స్‌లో కొనసాగుతున్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ప్రస్తుతం క్వార్టర్స్ శిథిలావస్థకు చేరడంతో స్కూల్ ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేసిన విషయాన్ని డిప్యూటీ మేయర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో 1 నుంచి 5 వరకు చదువుకునే పేద విద్యార్థులకు అన్యాయం అవుతుందన్నారు. కార్యక్రమంలో ఆయా సంస్థల ప్రతినిధులు లక్ష్మీ నారాయణ, రమాదేవి, శోభ, ప్రవీణ్, శ్రీలత, మమత, ఫౌండేషన్ ఆర్గనైజర్స్ ఏ.సువర్ణ, లావణ్య, లత తదితరులున్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనకు మరో ఉద్యమం



ఆర్ట్స్ కళాశాల వద్ద మాట్లాడుతున్న బీసీ సంఘాల నేతలు

లాలాపేట: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ సాధనకు తెలంగాణ ఉద్యమం తరహాలో మరో ఉద్యమానికి సన్నద్ధం అవుతున్నామని సోమవారం ఓయూ క్యాంపస్‌లో అన్ని బీసీ సంఘాలు అత్యవసర సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ కళాశాల వద్ద బీసీ నేతలు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ తరహాలో వంటావార్పు, సకల జనుల సమ్మె వంటి కార్యక్రమాలతో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని నిర్మాణం చేస్తామన్నారు. దీనికోసం అన్ని బీసీ సంఘాలు జేఏసీగా ఏర్పాటవుతున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో వట్టికూటి రామారావు, బొమ్మ హన్మంత్‌రావ్, సాంబశివగౌడ్, నిజ్జన రమేష్ ముదిరాజ్, వీరు యాదవ్, శంకర్, జగన్, ఏలేందర్ యాదవ్, అరుణ్‌కుమార్, పూసల రమేష్, రామ్‌గౌడ్, బొమ్మ కిషోర్ తదితరులున్నారు.

రాజీవ్ రహదారి విస్తరణ తగ్గించాలి



అల్వాల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న బాధితులు

అల్వాల్: రాజీవ్ రహదారి రోడ్డు విస్తరణ తగ్గించాలని రోడ్డుకు ఇరువైపులా ఆస్తులు కోల్పోతున్న బాధితులు అన్నారు. ఈ మేరకు సోమవారం లోతుకుంట నుంచి అల్వాల్ తెలంగాణ తల్లి విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజీవ్ రహదారిపై నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్‌ను 200 అడుగుల నుండి 120 అడుగుల వరకు కుదించాలన్నారు. రైతు బజార్ సమీపంలోని బ్రిడ్జి రోడ్డును తెలంగాణ తల్లి నుంచి నేరుగా నిర్మించాలని దీంతో జీవిరెడ్డి కాలనీ వారికి ఉపశమనం కలుగుతుందన్నారు. రోడ్డు విస్తరణ తగ్గిస్తే అనేక మందికి ఊరట లభిస్తుందన్నారు. కార్యక్రమంలో రాజీవ్ రహదారి ప్రాపర్టీస్ ఓనర్స్ జేఏసీ ప్రతినిధులు తేలుకుంట సతీష్‌గుప్తా, డాక్టర్ సుధాకర్, రాఘవేంద్ర, సూర్యప్రకాష్‌రెడ్డి, భాషా, కృష్ణారెడ్డి, కమలయ్య, ధనలక్ష్మీ, సచిన్, అనురాధ, విజయలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ అనుకూల సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టి



సింపోజియం సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న సైంటిస్టులు

లాలాపేట: సీఎస్ఐఆర్–ఐఐసిటీలో సస్టైనబుల్ ఆర్గానిక్ సింథసిస్ కెమికల్ బయాలజీ–2025 రెండు రోజుల జాతీయ సింపోజియం సోమవారం ప్రారంభమైంది. ఐఐసిటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సింపోజియం ప్రారంభ సదస్సులో ప్రముఖ పారిశ్రామిక వేత్త భీమారావు, ఆర్గానిక్ కెమిస్ట్రీ ప్రముఖ సైంటిస్టు ప్రొఫెసర్ చంద్రశేఖరన్, ప్రొఫెసర్ గణేష్ పాండే, డా.జెఎస్ యాదవ్, సదస్సు కన్వీనర్ డా.చాడ రాజిరెడ్డి, అమెరికా, జర్మనీ, సింగపూర్, ఫ్రాన్స్ నుంచి వక్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ఇటీవల రసాయన శాస్త్రాల్లో స్థిరత్వంపై ప్రపంచ వ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించిందన్నారు. పర్యావరణ అనుకూల సాంకేతిక పరిజ్ఞానాలపై వినూత్న వ్యూహాలను రూపొందించడానికి ఈ జాతీయ సింపోజియం ఎంతగానో దోహదపడుతుందన్నారు. రసాయన జీవశాస్త్రంలో స్థిరమైన విధానాలపై దృష్టిసారిస్తూ గ్రీన్ కెమిస్ట్రీకి అందరూ కృషి చేయాలన్నారు. యువ శాస్త్రవేత్తలు, పరిశ్రమల ప్రతినిధులు, పరిశోధక విద్యార్థులు దాదాపు 500 మంది పాల్గొన్నారు.

రూ.45 లక్షలు విలువ చేసే టపాసులు సీజ్



క్రాకర్స్‌తో అభిమన్యు కుమార్ శర్మ

కంటోన్మెంట్: జనావాసాల నడుమ ఓ దుకాణంలో డంప్ చేసిన టపాసులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు సీజ్ చేశారు. తిరుమలగిరి పోలీసుల సహకారంతో నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసుల బృందం జరిపిన దాడుల్లో టీచర్స్ కాలనీలోని ఓ దుకాణంలో నిల్వ చేసిన రూ.45 లక్షలు విలువ చేసే వివిధ బ్రాండ్‌ల ఫైర్ క్రాకర్స్‌ను సీజ్ చేశారు. నిందితుడు అభిమన్యు కుమార్ శర్మ(54)ను అదుపులోకి తీసుకున్నారు. వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నిందితుడు సదరు ఫైర్ క్రాకర్స్ స్టోరేజికి సంబంధించి ఎలాంటి అనుమతులు తీసుకోలేదని తెలుస్తోంది. ఇదిలా ఉండగా జనావాసాల నడుమ పేలుడు పదార్థాలను నిల్వ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైవీఎస్ సుధీంద్ర ఆదేశాల మేరకు ఈ దాడుల్లో నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ కె.చంద్రశేఖర్, తిరుమలగిరి ఇన్‌స్పెక్టర్ సి.నాగరాజు, ఎస్ఐలు పి.గగన్‌దీప్, డి.కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.